

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



**విశ్వంభర,నిజామాబాద్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోనీ ఉప వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో,ఆరోగ్య ఉప కేంద్రాల్లో సమయపాలన పాటించాలని, వారి వారి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసేలా సమీక్షలు నిర్వహించాలని అన్నారు. ప్రతి ఆశా గృహ సందర్శనలో భాగంగా స్పర్శ లేని మచ్చలను గుర్తించాలని కోరారు. క్షయ నియంత్రణలో భాగంగా క్షేత్రస్థాయిలో నిర్ధారణ పరీక్షలు చేయాలని అన్నారు. మాతా,శిశు ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. గర్భిణీ స్త్రీలందరికీ నాలుగు విడతల్లో పరీక్షలు నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న గర్భిణీ స్త్రీల జాబితాలను సేకరించి ఫాలో అప్ చేయాలన్నారు. ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీలను గుర్తించి ప్రత్యేక పర్యవే క్షణ చేయాలని ,ప్రసవ ప్రణాళికను పగడ్బందీగా నిర్వహించాలని కోరారు. అర్హులైన శిశువులందరికి 100 శాతం వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలని, పెండింగ్ లో ఉన్న శిశువుల జాబితా సేకరించి పర్యవేక్షణ చేయాలన్నారు. జీవన శైలి వ్యాధుల నియంత్రణలో మెడికల్ ఆఫీసర్ లాగిన్ లో పెండింగ్ లేకుండా ఎంట్రీ చేయాలని అన్నారు. డివిజన్ల వారీగా ఉన్న స్కానింగ్ కేంద్రాల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఫార్మ్ ఎఫ్ ఆడిట్ చేయాలన్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా రిఫరల్ చిల్డ్రన్స్ యొక్క జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో, జిల్లా టీకాల అధికారి డాక్టర్ అశోక్, డి టి సి ఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, జిల్లా ఉపవైద్యాధికారులు డాక్టర్ రవీందర్, డాక్టర్ సమత, డాక్టర్ అశ్విని, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్వేత, డాక్టర్ వెంకన్న, డాక్టర్ సుప్రియ, డాక్టర్ సామ్రాట్ ,డాక్టర్ శిఖరా, డాక్టర్ చైతన్య, డాక్టర్ శ్రావ్య, పీఎంఓ రూప, డిహెచ్ఇ ఘన్పూర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

**నగరంలో పలుచోట్ల ధర్నాలు**



**విశ్వంభర, హైదరాబాదు:** నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాదు నగరంలోని పలుచోట్ల కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్, అర్బన్ ఫారెస్ట్ వర్కర్లు ధర్నాలు నిర్వహించారు. ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా సోమవారం హైదరాబాదు నగరంలోని పలు ప్రాంతాల్లో కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్, అర్బన్ ఫారెస్ట్ వర్కర్ల గ్రూప్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. హెచ్ఎంఎస్, సీఐటీయూ అనుబంధ సంఘాలు సంయుక్తంగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాల్లో హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమారస్వామి, కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి. శ్రీకాంత్, హెచ్ఎంఎస్ నగర అధ్యక్షుడు అంజద్, హెచ్ఎంఎస్ బీపీపీ నాయకుడు నర్సింగ్‌రావు, సీఐటీయూ జనరల్ సెక్రెటరీ ఆరోగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని ఖైరతాబాదు, ముషీరాబాదు, సికింద్రాబాదు, నల్లకుంట తదితర ప్రాంతాల్లో ధర్నా లనిర్వహించారు

## సామల యాదగిరి విగ్రహావిష్కరణ



**విశ్వంభర, నారాయణగూడ :** ప్రగతిశీల గుర్తింపు ఉపాధ్యాయ సంఘం యాభై ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘం వ్యవస్థాపకులు సామల యాదగిరి విగ్రహాన్ని సోమవారం నారాయణగూడ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శివసేన నాయకుడు గణేష్ గౌటే పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ సంఘం ఏర్పడిన నాటి నుంచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముందుండే సంఘమని ఆయన పేర్కొన్నారు.

## కార్మిక వ్యతిరేక చట్టాల రద్దుకు డిమాండ్



**విశ్వంభర, హిమాయత్‌నగర్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు కార్మిక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. హిమాయత్‌నగర్‌లోని రాజ్ బొద్దోర్ గౌరు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కాపాడాలంటే ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఆరుట్ల రాజ్ కుమార్, జేరుపోతుల కుమార్, వై ఉషాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## 8వార్డులో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రచారం

**విశ్వంభర, పరిగి:** పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 8వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హబీబ్ ఉనిస అయూబ్ తరపున ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.చేయ గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తుందని అన్నారు .. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో భీమ్‌గల్‌కు ఒరిగిందేమీ లేదు

**మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**



**విశ్వంభర, నిజామాబాద్:** భీమ్‌గల్ మున్సిపాలిటీనిబకాసురుల నుండి కాపాడుకోవాల్సిన బాధ్యత పట్టణ ప్రజలందరిపై ఉందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం భీమ్‌గల్‌లో చివరిరోజు నిర్వహించిన బీఆర్ఎస్ అభ్యర్థుల ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని వేముల విమర్శించారు. "ఒకసారి నమ్మితే మోసం చేసినవాడిది తప్పు.. రెండోసారి కూడా నమ్మితే నమ్మినవాడిదే తప్పు అవుతుంది" అని పేన్నారు.ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లలో భీమ్‌గల్‌లో ఒక్క పైసా పని కూడా జరగలేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని వేముల ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 11.5 కోట్ల నిధులతో తాను మంజూరు చేయించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను రెండేళ్లుగా నిలిపివేశారని ఆరోపించారు. 100 పడకల ఆసుపత్రి 80 శాతం పనులు పూర్తయిన ఆసుపత్రిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. భీమ్‌గల్ ప్రజల సౌకర్యార్థం తాను తెచ్చిన బస్సు డిపోను ఈ ప్రభుత్వం మూసివేసిందని మండిపడ్డారు. రైతులకు ఉపయోగపడే మార్కెట్ పనులను కూడా కాంగ్రెస్ అటకెక్కించిందన్నారు. డబ్బులతో ఓట్లు కొనాలని చూస్తున్నారని అన్నారు.ఎన్నికలు రాగానే కాంగ్రెస్ నాయకులు సంచులు పట్టుకొని వస్తున్నారని, ఒక్కో వార్డుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ ఓట్లు కొనాలని చూస్తున్నారని విమర్శించారు. "డబ్బులు ఇస్తే తీసుకోండి.. కానీ ఓటు మాత్రం కారు గుర్తుకే వేయండి" అని ఆయన పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు రేవంత్ రెడ్డి చెప్పిన అబద్ధపు హామీలే ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో ల;లు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ భీంగల్‌కు వచ్చి "ఇవి చేస్తాం... అవి చేస్తాం" అంటూ హామీల వర్షం కూరపిస్తున్నాడు.అయన కొత్తగా చెప్పింది ఏమి లేదు. కానీ గతంలో భీంగల్ ప్రజలకు కష్టకాలం వచ్చినప్పుడు ఆయన ఎక్కడ ఉన్నారు అని ప్రశ్నించారు. "గత రెండేళ్లుగా భీంగల్ ప్రజల కోసం ఒక్క పని కూడా చేయకుండా, ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని ఇవి చేస్తాం... అవి చేస్తాం అంటూ ఉపన్యాసాలు ఇవ్వడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమే. భీంగల్ ప్రజలు ఈ వాస్తవాలను గమనించి, ఎవరు నిజంగా అభివృద్ధి చేశారో... ఎవరు మాటలకే పరిమితమయ్యారో తేల్చే సమయం వచ్చింది. భీమ్‌గల్ అంటే తనకు ఎంతో ప్రాణము.. భీమ్‌గల్‌ను కూడా తాను అలాగే అభివృద్ధి చేసానని" వేముల చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే, నిలిచిపోయిన పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అభ్యర్థులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 70ను రద్దు చేయాలి



**విశ్వంభర, భద్రాచలం:** స్థానిక భద్రాచలం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో సోమవారం తెలుగుదేశం పార్టీ న్యాయ విభాగం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎల్‌పి),ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 70ను తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సుమారు 30 సంవత్సరాల క్రితం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు న్యాయం మరింత సులభంగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జీవో 406ను తీసుకువచ్చిందని న్యాయవాదులు గుర్తు చేశారు. ఈ జీవో ద్వారా ఏజెన్సీ డివిజనల్ అధికారుల పరిధిలో ప్రత్యేకంగా మొబైల్ కోర్టుల వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది ఏజెన్సీ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా మారిందని పేర్కొన్నారు. ఆ రోజుల్లో ఏజెన్సీ డివిజనల్ అధికారులు గ్రామాలు, మండల కేంద్రాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రజల ఫిర్యాదులను ప్రత్యక్షంగా స్వీకరించి పరిష్కరించేవారని తెలిపారు. ఈ విధానం వల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులు, నిరుపేదలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలోనే న్యాయం పొందగలిగేవారని అన్నారు. కానీ మొబైల్ కోర్టుల వ్యవస్థను బలహీనపరిచే విధంగా ఇటీవల తీసుకొచ్చిన జీవో నెంబర్ 70 ఏజెన్సీ ప్రజల హక్కులను హరించడమేనని ఆరోపించారు. గతంలో ఏజెన్సీ డివిజనల్ కోర్టులు నిర్వహిస్తున్న సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పర్యటనలకు వచ్చినప్పుడు కోర్టులు వాయిదా పడటం వల్ల కక్షిదారులు, న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు.కోర్టులు తరచుగా వాయిదా పడటంతో కేసుల విచారణలో తీవ్రమైన జాప్యం జరిగి, కక్షిదారులు ఆర్థికంగా, మానసికంగా నష్టపోయారని తెలిపారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకే అప్పట్లో ప్రభుత్వం 29 ఏజెన్సీ మండలాలకు ప్రత్యేకంగా మొబైల్ కోర్టులను ఏర్పాటు చేసి, ప్రత్యేక న్యాయమూర్తులను నియమించిందని వివరించారు. గత 30 సంవత్సరాలుగా మొబైల్ కోర్టుల ద్వారా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు సత్వర న్యాయం అందుతోందని, ఈ వ్యవస్థను రద్దు చేసి మళ్లీ పాత విధానాన్ని తీసుకురావడం అత్యంత దురదృష్టకరమని న్యాయవాదులు విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి, న్యాయ వ్యవస్థకు కూడా విరుద్ధమని వ్యాఖ్యానించారు.భద్రాచలం ఏజెన్సీ డివిజనల్ కోర్టుకు వచ్చే కక్షిదారులు సుదూర అటవీ ప్రాంతాలు, కొండ ప్రాంతాల నుంచి ప్రయాణించి రావాల్సి వస్తుండటంతో, కోర్టులు సరిగా నడవకపోవడం వల్ల వారికి తక్షణ న్యాయం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాల నుంచి రావడం వల్ల అనేక మంది కేసులను మధ్యలోనే వదులుకుంటున్న పరిస్థితి ఉందని తెలిపారు. గతంలో అమలులో ఉన్న విధానాన్ని కొనసాగిస్తూ మొబైల్ కోర్టులకు పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయించి, పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి, ప్రత్యేకంగా శిక్షణ పొందిన అధికారులను మొబైల్ కోర్టులకు నియమించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఏజెన్సీ ప్రజల న్యాయ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కొడాలి శ్రీనివాసన్, రావి రామ్మోహన్ రావు, అవులూరి సత్యనారాయణ, సాధనపల్లి సతీష్, టీ. చైతన్య, బండారు అరుణ్ చందు, పేరాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్, ఓట్ల లెక్కింపునకు భద్రత చర్యలు: జిల్లా ఎస్పీ డా. శబరీష్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్, 13వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ మహబూబాబాద్ పట్టణంలోని డిగ్రీ కళాశాల మరియు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాలలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించారు . భద్రతా ఏర్పాట్లను రిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, బారికేడింగ్, పోలీస్ పికెట్లు, పార్కింగ్ సదుపాయాలు, మీడియా గది తదితర ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, స్ట్రైకింగ్ ఫోర్స్, రూట్ మొబైల్స్, ప్రత్యేక నిఘా బృందాలు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తాయని ఎస్పీ తెలిపారు.

**750 మంది పోలీస్ సిబ్బందితో భద్రతా బందోబస్తు**

మహబూబాబాద్ జిల్లాలోని (మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం,మరిపెడ, తొర్రుర్ )ఐదు మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 750 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు. 5 డీఎస్పీలు, 16 సీఐలు, 27 ఎస్ఐలు, 96 ఏఎస్ఐ,హెచ్‌సీలు, 543 పీసీ,హోమ్‌గార్డులు, 63 మహిళా సిబ్బంది, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల కేసులో చిక్కుకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. అన్ని శాఖలతో సమన్వయంగా పని చేసి మహబూబాబాద్ జిల్లాలో పోలింగ్,కౌంటింగ్ ప్రక్రియలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఎస్పీ డా. శబరీష్ తెలిపారు.

## ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్

**ఆలేరు ప్రథమం..గురుమిళ్ళ ద్వితీయ**



**విశ్వంభర,ఇనుగుర్తి :** మహాశివరాత్రి పురస్కరించుకొని మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న నాగారంలో ముత్యాలమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ప్రథమ బహుమతి ఆలేరుటీం కైవసం చేసుకోగా.. బండారు మల్లారెడ్డి జ్ఞాపకార్థం రూ. 20 వేల నగదును దాత బండారు రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ద్వితీయ బహుమతి గుర్మిళ్ళ టీంకు.. కొయ్యడిపిచ్చమ్మ జ్ఞాపకార్థం రూ 15 వేల నగదు, షీల్డ్ను ఆమె భర్త కొయ్యడి రామచంద్ర గౌడ్, కుమారుడు దయాకర్ గౌడ్ అందజేశారు. తృతీయ బహుమతి బ్రాహ్మణ కొత్తపల్లి టీంకు ..రిటైర్డ్ కానిస్టేబుల్ బైరు మురళి, అండమ్మ దంపతుల జ్ఞాపకార్థంరూ. 9 వేలు నగదు, షీల్డ్ను వారి కుమార్తెలు మారగాని లావణ్య, ముత్యం కళ్యాణి పంపిణీ చేశారు. 4వ,బహుమతి జేఎస్ఎస్ హనుమకొండ టీంకు.. వర్ధోలు వెంకన్న,అజిత్ ల జ్ఞాపకార్థం రూ. 5 వేల నగదు, షీల్డ్ వర్ధోలు కొమురమ్మ అందజేశారు. బెస్ట్ రైడర్ డిపెండర్ బహుమతి బైరు శ్రీరాం ప్రసాద్ జ్ఞాపకార్థం రూ.1,116 నగదు షీల్డ్ ఆయన బాబాయి బైరు శ్రీనివాస్ అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలకు ప్రైజులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి చెడుపాక సుజాత యాకయ్య, ఉప సర్పంచ్ తుమ్మనపల్లి సతీష్,వార్డు సభ్యులు మునిగంటి సరిత రాజు,ముత్యాల సోమక్క వెంకన్న,గుండాల మంగమ్మ ధర్మయ్య,చెడుపాక అలివేలు వెంకన్న,బైరు వెంకన్న,నిడిగంటి చంద్రమౌళి,బైరు వినయ్ గౌడ్, వై. శ్రీనివాస్ యాదవ్,చెడపాక సురేష,కాంగ్రెస్ జిల్లా నాయకులు బైరు అశోక్ గౌడ్, క్రీడా నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల హక్కుల సాధనకు దేశవ్యాప్త సమ్మె : రాంబాబు యాదవ్


**విశ్వంభర, హైదరాబాదు:** కొత్తగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌తో పాటు కార్మిక హక్కులను బలహీనపరుస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నామని బీఆర్ఎస్‌కేవీ (భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం) రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ అన్నారు. సోమవారం హైదరాబాదు బాగ్ లింగంపల్లిలోని బీఆర్ఎస్‌కేవీ కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. "నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా మినిమం జీతం, పని గంటలు, యూనియన్ హక్కులు, ఉపాధి భద్రత, సామాజిక రక్షణ వంటి కీలక అంశాలు బలహీనపడుతున్నాయి. కార్మికులపై కార్పొరేట్ ఒత్తిడిని పెంచే ఈ విధానాలను మేం అంగీకరించము. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసమే ఈ నెల 12న సమ్మె. ఐక్య పోరాటంతోనే మన హక్కులు కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. ఈ నెల 12న ఉదయం 10:30 గంటలకు బాగ్ లింగంపల్లి బస్ భవన్ నుంచి ఇందిరా పార్క్ వరకు భారీ ర్యాలీ, అనంతరం ఇందిరా పార్క్ వద్ద సభ జరుగుతుందని, కార్మికులు, కార్మిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీ, సభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ హైదరాబాద్ ఇంచార్జ్ లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి మహేష్ దేశపాక్, చ. సాయి కుమార్, కి. మారుతీ, ఆకుల శ్రీనివాస్, కిరణ్, పి. నిరంజన్, ఎన్. రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కనీస పింఛన్ రూ.9 వేలు చెల్లించాలని ధర్నా



**విశ్వంభర, బర్కత్‌పుర :** ఇపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్‌ను రూ. 9,000కు పెంచాలని, అర్హులందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 9,న దేశవ్యాప్తంగా పీఎఫ్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. సోమవారం హైదరాబాదు బర్కత్‌పురాలో జరిగిన ధర్నాలో గౌరవాధ్యక్షుడు ఎం.ఎన్. రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జనార్దన్ రెడ్డి, ప్రధాన వక్త పి. కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కనీస పెన్షన్ రూ. 9,000, అర్హులందరికీ హయ్యర్ పెన్షన్, పెన్షనర్లు--జీవిత భాగస్వాములకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, నరహరి, అరుణ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## భాజపా అభ్యర్థికి మద్దతుగా జనసేన ప్రచారం



**విశ్వంభర, చౌటప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటప్పల్ మున్సిపల్ 6వ వార్డు భాజపా అభ్యర్థి ఆలె శ్వేత చిరంజీవికి మద్దతుగా జనసేన పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో జనసేన నాయకులు ఆముదాల పరమేశ్, పల్చం శ్రీకాంత్, కల్లెట్ల రాజు,పీక ప్రవీణ్, చిన్నం ప్రశాంత్, ప్రవీణ్ , రాజు,సరికొండ సంజయ్,వర్కాల నిఖిల్, చిమకండ్ల మధు,సుల్తాన్ రాజు, పాండు ,శివరామ్, గణేశ్, సాయి ప్రకాశ్, ఉదయ్, సన్నీ పాల్గొన్నారు.

## ఆక్రమణలు.. హైడ్రాకు 72 ఫిర్యాదులు



**విశ్వంభర, హైదరాబాదు:** నగర కాలనీల్లో పార్కులు, పాఠశాలల గ్రౌండ్లు, రహదా రులు, ప్రజావసరాల స్థలాలను అక్రమంగా కబ్జా చేస్తున్నారని హైడ్రా ప్రజావాణిలో పలు ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం ఒక్కరోజే 72 ఫిర్యాదులు అందగా.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పంపించారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.